## క్లుప్తంగా

### 54 మంది గైర్హాజరు

**కిర్లంపూడి:** కిర్లంపూడి, బూరుగుపూడి, తామరాడ, జగపతినగరం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన పరీక్షలకు ఆయా కేంద్రాల్లో 1,094 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,040 మంది పరీక్షలు రాశారు. మొత్తం 54 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోషఫ్ తెలిపారు. అలాగే కిర్లంపూడి, తామరాడ, వీరవరం ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి.

### కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా మొయ్యేటి


మొయ్యేటి సూర్యప్రకాశరావు

**ప్రత్తిపాడు రూరల్:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా పోతులూరుకి చెందిన మొయ్యేటి సూర్యప్రకాశరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ సాకే శంకర్ నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతానన్నారు.

### అన్న సమారాధన

**కిర్లంపూడి:** కిర్లంపూడిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### వరి పంట కోత ప్రయోగం


కొమ్మనాపల్లిలో వరి పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఈఓ

**తొండంగి:** మండలంలోని కొమ్మనాపల్లిలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. కొమ్మనాపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ఎస్ గణేశ్వరరావు పొలంలో రబీ వరి పంటలో గణాంక శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది కలిసి కోత నిర్వహించారు. ఎకరాకు 42 బస్తాల దిగుబడి వచ్చినట్టు ఏఈఓ కొప్పన దైవప్రసాద్ తెలిపారు. పంట కోత దశలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా కిరణ్‌కుమార్


తోట నరసింహం, రాంజీతో కిరణ్‌కుమార్

**గోకవరం:** వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కో-కన్వీనర్‌గా గోకవరానికి చెందిన ఇజ్జిన కిరణ్‌కుమార్‌ని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం నియమించారు. కిర్లంపూడి మండలం వీరవరంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో కిరణ్‌కుమార్‌ని సత్కరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో యువనేత తోట రాంజీ, పార్టీ సేవాదళ్ నేత ఒమ్మి రఘురామ్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు అడపా సురేష్, జిల్లా కో-కన్వీనర్ పాము సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ నుంచి పలువురి చేరిక**

మండలంలోని కొత్తపల్లికి చెందిన నేదునూరి త్రిమూర్తులు, మరి కొందరు తోట నరసింహం సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి తోట నరసింహం పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు.

### ధాన్యం, గడ్డి ట్రాక్టర్ దగ్ధం


పెదశంకర్లపూడిలో విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమవుతున్న ట్రాక్టర్

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని పెదశంకర్లపూడిలో మంగళవారం రాత్రి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన మొల్లేటి రాము ఎకరన్నర పొలంలో పండించిన గడ్డి, 15 కాటాల ధాన్యాన్ని ట్రాక్టర్‌లో వేసుకొని ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో 11 కేవీ విద్యుత్ తీగలు తగలి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గడ్డి, ధాన్యం కాలి బూడిద అయ్యాయి. ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

# రుణానుబంధం

- ఆసరా పథకంతో మహిళల జీవితాల్లో వెలుగులు
- నాలుగేళ్లలో మండలంలో రూ.20.67 కోట్ల రుణ మాఫీ
- అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం

**రౌతులపూడి:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు.. వారిని అన్ని రంగాల్లోనూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఆసరా పథకం వారి జీవితాల్లో వెలుగు నింపింది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో దశలవారీగా డ్వాక్రా సంఘాల రుణాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నూరుశాతం అమలు చేశారు. ఎన్నికల తేదీ నాటికి ఉన్న డ్వాక్రా రుణాల అప్పు మొత్తాన్ని ఏదైతే మహిళలు ఆయా బ్యాంకుల్లో డ్వాక్రా రుణాలను పొందారో.. ఆయా అప్పులకు సంబంధించి అప్పటి వరకున్న మొత్తాన్ని మాఫీ చేస్తామని ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలందరికీ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు దఫాలుగా రుణం మొత్తాన్ని చెల్లించి మహిళల గుండెల్లో గూడు కట్టుకున్నారు.


రౌతులపూడిలో మహిళా సంఘాలకు ఆసరా పథకం చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు (ఫైల్)


లచ్చిరెడ్డిపాలెంలో మహిళా సంఘ సభ్యులకు రుణాల చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న వీఓఏ

**800 సంఘాల గుర్తింపు**

మండలంలోని 26 పంచాయతీల పరిధిలో 42 గ్రామైక్య మహిళా సంఘాలున్నాయి. వీటిలో 11 ఏప్రియల్, 2019 నాటికి (గత సార్వత్రిక ఎన్నికల తేదీ) ఇచ్చిన హామీ మేరకు మండల వ్యాప్తంగా 800 మహిళా డ్వాక్రా సంఘాల సభ్యులను అర్హులుగా అధికారుల గుర్తించారు. ఈ మేరకు తొలి విడతగా రూ. 5,17,50,371, రెండో దఫా 800 మహిళా సంఘాలకు రూ.5,17,50,371, మూడో దఫా 793 మహిళా సంఘాలకు రూ.5,15,18,926, నాలుగో దఫా 799 మహిళా సంఘాలకు రూ.5,16,78,924,, వెరసి నాలుగేళ్లకు రూ.20.67 కోట్లకు పైగా డ్వాక్రా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

### సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



గత సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా సంఘాల రుణాలను దశలవారీగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నూటికి నూరుశాతం నిలబెట్టుకున్నారు. గుమ్మరేగుల గ్రామంలో పది మంది సభ్యులతో శ్రీదేవీ మహిళా సంఘం పేరుతో 2018లో తుని ఇండియన్ బ్యాంకులో రూ.7 లక్షల డ్వాక్రా రుణం తీసుకున్నాం. అప్పటి నుంచి క్రమం తప్పకుండా అసలు, వడ్డీ, పొదుపుతో కలిపి రుణాలు తిరిగి బ్యాంకుకు చెల్లించాం. 11 ఏప్రిల్, 2019 నాటికి మా గ్రూపు పేరున రూ.6,80,000 అప్పుగా ఉంది. ఈ మొత్తాన్ని నాలుగు దఫాలుగా ఏడాదికి రూ.రూ.1,70,000 చొప్పున మా గ్రూపు పేరున ప్రభుత్వం రుణమాఫీ కింద జమ చేసింది. దీంతో నేను రూ.68 వేల లబ్ధి పొందాను. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి ఈ పథకం ఎంతగానో దోహదపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

గిడుతూరి రమణమ్మ, శ్రీదేవీ డ్వాక్రా గ్రూపు గుమ్మరేగుల

### ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు



గత సార్వత్రిక ఎన్నికల తేదీ నాటికి ఉన్న డ్వాక్రా రుణాలను దశల వారీగా మాఫీ చేస్తామని ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి అయ్యాక నూటికి నూరుశాతం నిలబెట్టుకున్నారు. రౌతులపూడి మండలం రాజవరం గ్రామంలో 11 మంది సభ్యులతో గంగాభవాని మహిళా సంఘం పేరుతో తుని యూనియన్ బ్యాంకులో 4 ఆగస్టు, 2018లో రూ.7 లక్షల రుణం తీసుకున్నాం. క్రమం తప్పకుండా బాకీ చెల్లించగా, గత సార్వత్రిక ఎన్నికల నాటికి మా గ్రూపు పేరున రూ.5,57,424 అప్పుగా ఉంది. ఈ మొత్తాన్ని నాలుగు దఫాలుగా ఏటేటా రూ.1,39,356 చొప్పున మా గ్రూపు సభ్యులకు ప్రభుత్వం రుణ మాఫీ అందజేసింది. నేను రూ.50,674 లబ్ధి పొందాను. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఈ దఫా కూడా ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

వాసంశెట్టి కుమారి, గంగాభవాని గ్రూపు, రాజవరం

### బెహరా దొరబాబుకు ఘన సన్మానం


బెహరా దొరబాబు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, పార్టీ నేతలు

**ప్రత్తిపాడు రూరల్:** వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బెహరా దొరబాబును ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, పార్టీ నేతలు మంగళవారం అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా దొరబాబు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ పదేళ్లకు పైగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా దొరబాబు బాధ్యతలు చేపట్టారన్నారు. తాజాగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడి బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉప సర్పంచ్ మదినే నూకరాజు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, పినిశెట్టి ప్రకాష్, ఏనుగుపల్లి శేఖర్, గానాల గంగాధర్, రాపా గుర్రాజు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

### మహా కుంభాభిషేకంలో ప్రత్యేక పూజలు

**గోకవరం:** రమా సత్యనారాయణస్వామి ఆలయ శిఖర పునః ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం మహోత్సవంలో రెండో రోజైన మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామితో పాటు, సుబ్రహ్మణ్యేశ్వరుడు, అయ్యప్పకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతిదేవి దంపతులు ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే జగన్ లక్ష్యం

- ఎంపీగా గెలిపిస్తే ప్రతి గ్రామం రూ.కోటితో అభివృద్ధి
- కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- మల్లవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహంతో కలిసి ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

**గోకవరం:** రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం పార్టీ జగ్గంపేట అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహంతో కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో సునీల్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకే ప్రయోజనాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, మళ్లీ ఈ ఎన్నికల్లో మేనిఫెస్టోలో మరిన్ని లబ్ధి చేకూర్చే పథకాలను ప్రకటించి, వాటినీ అమలు చేసి తీరుతారన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధిని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును ప్రతిఒక్కరూ గుర్తించి, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా, తోట నరసింహంను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో గ్రామాలను దత్తత తీసుకుని, ప్రతి గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేస్తానన్నారు. మెట్ట ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. చదువుకున్న యువతకు సెంటర్లు ఏర్పాటు చేసి, ఏటా ఐదు వేల మందికి శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తోట నరసింహం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కోట్లాది రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేసిందన్నారు. మహిళలకు ఆసరా, చేయూత వంటి పథకాలను అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవడం ద్వారా మరిన్ని పథకాలను పొందాలన్నారు. స్థానిక నాయకుడు పైల కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ముత్యాల శ్రీనివాస్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఎనలేని ఆదరణ


రౌతులపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో వరుపుల సుబ్బారావు

**వరుపుల సమక్షంలో అనేక మంది పార్టీలోకి చేరిక**

**ప్రత్తిపాడు రూరల్:** రౌతుపాలెంలో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వైఎస్సార్ సీపీ నేత పెదిరెడ్ల రాజీవ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మన్యాల వీరబాబు, ఉల్లంకల అప్పన్న, నాగళ్ల సూరిబాబు, వీరమళ్ల గంగాధర్, కుండల వీర్రాజు తదితరులకు వరుపుల సుబ్బారావు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వరుపుల మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ప్రజల్లో ఎనలేని ఆదరణ పెరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు ప్రజల్లో వెలుగులు నింపాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దాశె చిట్టిబాబు, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, ఎంపీటీసీ పిల్లా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సీఎం జగన్ వెంటే..

**వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు**


పెద్దనాపల్లిలో ఎన్నికల ప్రచారంలో వరుపుల


కొంతంగిలో సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న వరుపుల సుబ్బారావు

**ఏలేశ్వరం:** రాష్ట్రంలోని ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం పార్టీ నేతలు కొడెల నాగేశ్వరరావు, కోడెల రాంబాబు ఆధ్వర్యంలో పెద్దనాపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా ప్రజల మద్దతు లేకపోవడంతో ప్రతిపక్షాలకు ఓటమి తప్పదన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌కు ప్రజలంతా బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడపా సోమేష్, అడపా పార్థసారథి, వేగి రాంబాబు, వేగి ప్రభాకరరావు, కొట్టు దావీదు, పెంటకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీదే విజయం**

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని వరుపుల సుబ్బారావు అన్నారు. లింగంపర్తి గ్రామంలో ప్రత్తిపాడు మండలం వెంకటనగరానికి చెందిన పార్టీ నేత సింహాద్రి బాబీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వరుపులను కలిశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ఈ గెలుపు ద్వారా పేద ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. అన్ని వర్గాల మద్దతు సీఎం జగన్‌కు ఉందన్నారు. ఉప సర్పంచ్ గొరికిపూడి బాపన్నదొర, కోరాపు చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

**మరొక్కసారి అవకాశమివ్వండి**

**శంఖవరం:** సంక్షేమ ప్రభుత్వానికి మరొక్కసారి అవకాశమివ్వాలని వరుపుల సుబ్బారావు కోరారు. కొంతంగి గ్రామంలో స్థానిక నేతలతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేసి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలకు మభ్యపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్‌లు దూడల రామస్వామి, శెట్టిబత్తుల కుమార్‌రాజా, కూనిశెట్టి మాణిక్యం, ఈగల విజయదుర్గ, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, వెలుగుల రవి, దూడల శివ, నేమాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సే జగన్ లక్ష్యం

**ఎన్నికల ప్రచారంలో తోట నరసింహం సతీమణి వాణి**


కె.నాయకంపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి, శ్రీనిధి

**గండేపల్లి:** ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అటువంటి నాయకుడితోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. ఆమెతో పాటు, కోడలు శ్రీనిధి మంగళవారం కె.నాయకంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సర్పంచ్‌లు పోకల సుబ్బు, ములంపాక సురేష్, మాజీ సర్పంచ్‌లు కుంచె చినబాబు, పల్లపు విష్ణుచక్రం, పార్టీ నేతలు మలిరెడ్డి గోపి కొండలరావు, బోళ్ల కోటేశ్వరరావు, గోకిన రాజు, గందం లాజర్, గొల్లేపిల్లి రవి, కాకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నతోనే అన్ని వర్గాలకూ మేలు

**గుర్రంపాలెంలో యువ నేత రాంజీ ప్రచారం**


ఇంటింటి ప్రచారం చేస్తున్న తోట రాంజీ

**జగ్గంపేట:** రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు చేసినదీ, భవిష్యత్తులో చేయగలిగేదీ జగనన్న మాత్రమేనని వైఎస్సార్ సీపీ జగ్గంపేట అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. గుర్రంపాలెం గ్రామంలో మంగళవారం ఆయన పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పేదలకు పెన్షన్లు అందజేయడంలోను, మహిళా సంఘాలకు రుణమాఫీ, విద్యార్థులకు అనేక పథకాలు, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. పేదల మేలు కోసం జగనన్న చేస్తున్న కృషిని అవగాహన చేసుకుని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ని, జగ్గంపేట అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహానికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు గఫూర్, డైరెక్టర్ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, జగాల్, గ్రామ నాయకులు చీపురపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

**మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్**


కొత్తకొట్టాంలో మహిళకు పథకాలు వివరిస్తున్న శంకర్ మల్లిక్

**కోటనందూరు:** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్ కోరారు. కొత్తకొట్టాంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ దొగ్గా లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, ప్రజా సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తన తండ్రి దాడిశెట్టి రాజాను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, పార్టీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

**ఆర్ఓ శ్రీనివాసరావు**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ శ్రీనివాసరావు

**ప్రత్తిపాడు రూరల్:** ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్ఓ) ఎ.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల నియమావళిపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారానికి ముద్రించే కరపత్రాలపై అన్ని వివరాలు ముద్రించాలన్నారు. లేకుంటే నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారం, ప్రకటనల్లో కుల, మత, భాషాపరమైన అంశాలు, విద్వేషాలను రగిల్చే అంశాలు ఉండరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీ లతాకుమారి, సీఐ శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు ఎస్ నరసింహారావు, వై రంగారావు, రత్నకుమారి, సీహెచ్ విద్యాపతి, కమిషనర్ కె.శివప్రసాద్, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్సైలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌కుమార్, వి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.